ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
మంగళవారం | 30 సెప్టెంబరు , 2025 | పేజీలు : 06

## పల్లా వెంకట్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన ఎన్‌విటి

**ప్రజాపక్షం/దేవరకొండ:** సిపిఐ జాతీయ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన పల్లా వెంకట్‌రెడ్డిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు, ఎస్‌బిఐ ఓబిసివెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్‌విటి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొట్టమొదటిసారిగా తెలంగాణ నుండి నియామకం కావడం, నల్గొండ జిల్లా దేవరకొండకు చెందిన ముద్దుబిడ్డ కామ్రేడ్ పల్లా వెంకట్‌రెడ్డికి విప్లవ అభినందనలు తెలియజేయడం గర్వంగా ఉందని అన్నారు.



# ఒక్కేసి పువ్వేసి చందమామ...



### సూర్యాపేట జిల్లాలో అంబరాన్నంటిన సద్దుల బతుకమ్మ సంబరాలు...

**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట జిల్లాలో సోమవారం సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరాన్ని అంటాయి. పల్లెల నుండి మొదలుకొని పట్టణాల వరకు చిన్నల నుండి పెద్దలు, ముసలి, ముత్తైద్దువుల వరకు కులమతాలకు అతీతంగా మహిళలంతా ఒకచోట చేరి బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలను ఒకచోట పెట్టి ఉయ్యాల ఉయ్యాల ఉయ్యాలో... ఒక్కసి పువ్వేసి చందమామ అంటూ ఆట పాటలతో సందడి చేశారు. డిజె పాటల నడుమ చప్పట్లు, కోలాటాలు వేసి అందరిని అలరించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగిన బతుకమ్మ వేడుకల్లో మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్‌రెడ్డి సతీమణి సునీత జగదీష్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి సతీమణి లావణ్యలు పాల్గొన్నారు. కోదాడ, హుజూర్‌నగర్, తుంగతుర్తి, తిరుమలగిరి, నేరేడుచర్ల మున్సిపాలిటిల పరిధిలో ఆయా పార్టీలకు చెందిన మాజీ ప్రజాప్రతినిధుల సతీమణులు సద్దుల బతుకమ్మ సంబరాల్లో పాల్గొని సందడి చేశారు. సాయంత్రం నాలుగు గంటల నుండి మొదలైన బతుకమ్మ ఆటలు రాత్రి 10 గంటల వరకు కొనసాగాయి. అనంతరం ఆయా ప్రాంతాలలోని చెరువులు, కుంటలు, కాల్వలు వద్ద బతుకమ్మలను నిమజ్జనం చేశారు. తొమ్మిది రోజులపాటు అత్యంత భక్తిశ్రద్ధలతో గౌరమ్మను కొలిచిన మహిళామణులు పోయిరా బతుకమ్మ పోయిరావమ్మా అంటూ... తమ పసుపు కుంకుమలను చల్లాగా కాపాడాలని తమ ఇంట్లో సిరుల పంట పండేలా చూడాలని వేడుకున్నారు.





**భారీ ఏర్పాట్లు...** బతుకమ్మ పండుగను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుండడంతో సంబంధిత శాఖల అధికారులు బతుకమ్మలు ఆడే ప్రాంతంలో భారీ ఏర్పాట్లు చేశారు. రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. డిజె సౌండ్స్ ఏర్పాటు చేశారు. త్రాగునీటి సౌకర్యం కూడా కల్పించారు.

**భారీ బందోబస్తు...** జిల్లా ఎస్పి కె నరసింహ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా పోలీసులు సద్దుల బతుకమ్మ పండుగకు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. పోకిరీల నుండి మహిళలు, యువతుల రక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టారు. మహిళల మెడలపై ఉన్న విలువైన బంగారు వస్తువులు చోరికి గురికాకుండా సిసి కెమెరాల నిఘాను ఏర్పాటు చేశారు.

### పోలీస్ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ అన్నారు.జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ ఉత్సవాలను ఏఎస్‌పి మౌనిక  ప్రారంభించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ వివిధ రకాల పూలతో బతుకమ్మను అద్భుతంగా పేర్చి బతుకమ్మ పండుగను నిర్వహించుకోవడం సంతోషకరమన్నారు.  ఈ సందర్భంగా జిల్లా ప్రజలందరికీ పోలీస్ శాఖ తరుపున బతుకమ్మ,దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ  కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి రమేష్,  ఎస్‌బి డిఎస్‌పి మల్లారెడ్డి, సిఐలు రాము, మహా లక్ష్మయ్య,రఘువీర్ రెడ్డి, ఆర్.ఐలు సంతోష్, శ్రీను, సూరపు నాయుడు,హరిబాబు, మహిళా యస్.ఐలు శ్రావణి, మౌనిక, విజయ బాయి,డిపిఓ మహిళా సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.





## రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతి

### ఒకరికి తీవ్ర గాయాలు

**ప్రజాపక్షం/చింతపల్లి :** నాగార్జునసాగర్ హైదరాబాద్ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయిన సంఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై రామ్మూర్తి తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని నసర్లపల్లి గ్రామ సమీపంలో సోమవారం చింతపల్లి నుండి మల్లేపల్లి వైపు ప్రయాణిస్తున్న ఆటోను మల్లెపల్లి నుండి హైదరాబాద్ వైపు వెళ్తున్న  కారు అతివేగంగా, అ జాగ్రత్తగా వచ్చి ఢీకొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురి యువకులలో ముగ్గురు యువకులు రత్లావత్ వినోద్ (26), రాత్లావత్ భాస్కర్(28), సపావట్ రవి( 28) అక్కడికక్కడే చనిపోగా మరో యువకుడైన జరుపుల కృష్ణకు తీవ్ర గ్రాయాలవడంతో చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు ఎస్సై తెలిపారు. కాగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరు యువకులు వినోద్, భాస్కర్లది దేవరకొండ మండలం వద్యతండా గ్రామానికి చెందినవారని ఎస్సై తెలిపారు. మృతులు దసరా పండుగా సందర్భంగా ఆటోలో సరుకుల కోసం చింతపల్లికి వెళ్లి తిరిగి తన సొంత గ్రామాలకు వెళ్తున్న సందర్భంలో రోడ్డు  ప్రమాదం జరిగినట్టు ఎస్సై తెలిపారు. మృతి చెందిన యువకులంతా అవివాహకులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు వినోద్ తండ్రి రత్లావత్ బజ్జు ఇచ్చిన  ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రామ్మూర్తి తెలిపారు. దసరా పండుగా పూట రోడ్డు ప్రమాదంలో యువకులు మృతి చెందడంతో ఆయా గ్రామాలలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుల బంధువులు రోధించిన తీరు చూపరులను కంటతడి పెట్టించాయి.





## క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయి

**ప్రజాపక్షం/అర్వపల్లి** : క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు దరూర్ యోగానంద చార్యులు అన్నారు. జాజిరెడ్డిగూడెం మండల గ్రామ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కబడ్డీ క్రీడ పోటీలు ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు నర్సింగ శ్రీనివాస్ గౌడ్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శిగ నసీర్ గౌడ్, మండల ఉపాధ్యక్షులు పెసర సతీష్ రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షులు నర్సింగ కృష్ణమూర్తి, గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వల్లాల ఖాజాయాదవ్ పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం/అర్వపల్లి** : మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొల్లం బాలమల్లు, మద్ది మల్లయ్యలు అనారోగ్యాలతో మరణించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ధరూరు యోగానందచార్యులు వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబీకులను పరామర్శించి బొల్లం బాలమల్లు కుటుంబానికి రూ.5వేలు, మద్ది మల్లయ్య కుటుంబానికి రూ.5వేలు ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో అమ్మవారికి పూజలు

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** మండల కేంద్రంలోని త్రి స్టార్ పేపర్ ప్లేట్స్ కంపెనీ వద్ద నెలకొల్పిన దుర్గామాత అమ్మవారికి శరన్నవరాత్రులలో భాగంగా సోమవారం త్రి స్టార్ పేపర్ ప్లేట్స్ ఇండస్ట్రీస్ యజమాని వరికుప్పల శేఖర్ ధనమ్మ దంపతులు, బొంత సత్యనారాయణ సుమలత దంపతులు ఘనంగా పూజలు చేశారు. 8వ రోజు అమ్మవారు గాయత్రిదేవి రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందజేశారు. ఈకార్యక్రమంలో అజయ్, విజయ్, గణేష్, ఈదయ్య, శంకర్, వెంకన్న, కోటి, హుస్సేన్, భాస్కర్, అర్చకులు భాస్కర శర్మ, అశోక్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.



# పెండింగ్ పాల బిల్లులను విడుదల చేయాలి

**ప్రజాపక్షం/ రామన్నపేట:** మదర్ డెయిరీ పరిధిలో గత మూడు నెలల 15రోజుల నుంచి పెండింగ్‌లో ఉన్న ఏడు బిల్లులైన రూ.20కోట్లను విడుదల చేసి రైతులకు న్యాయం చేయాలని చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లగొండ రంగారెడ్డి జిల్లా పరిదిలో 350 సంఘాలు, 20వేల మంది పాడి రైతులు, 24 చిల్లింగ్ కేంద్రాలు కలవు. గతంలో 1.60లక్షల లీటర్లు సేకరించి మదర్ డెయిరీ ఇప్పుడు కేవలం 50వేల లీటర్లు మాత్రమే రోజుకు సగటున సేకరిస్తుందని, ప్రతి 15 రోజులకు ఒకసారి పాడి రైతులకు బిల్లులు అందించాల్సి ఉండగా ఇప్పటికీ మూడు నెలల అయినా కూడా చెల్లించకపోవడంతో రైతులు ప్రైవేట్ వ్యక్తుల దగ్గర వడ్డీలకు అప్పులు తెచ్చి అనేక ఇబ్బందులు పడాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. దీంతో పాడి రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. 200 మంది ఉద్యోగులు చేసే పనిని 500 మంది ఉద్యోగులతో పనిచేయిస్తున్నారని, అదనంగా 300 మందికి కూర్చొబెట్టి అనవసరంగా జీతాలు ఇస్తున్నారని అన్నారు. నెలకు రూ.1.70కోట్లు రైతులపై భారం పడుతుందన్నారని అనానరు. వెంటనే పాలకవర్గం అప్పులు వడ్డీలు కట్టడం ఆపి పాడి రైతులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని లేనిపక్షంలో రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులను సమీకరించి ఆందోళన నిర్వహిస్తామన్నారు.

# సుప్రీంకోర్టు సీజేపై అనుచిత వ్యాఖ్యలా..!



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అడ్వకేట్లు సిద్దిపేటకు చెందిన మురళీమోహన్ రావు, ప్రొద్దుటూరు శ్రీకాంత్‌లపై చర్యలు తీసుకోవాలని కుల వివక్ష వ్యవతిరేక పోరాట సమితి రాష్ట్ర కమిటీ సభ్యులు రెమడాల పరుశురాములు, జిల్లా ఉపాధ్యక్షుడు కోడిరెక్క మల్లయ్యలు డిమాండ్ చేశారు. 78 ఏండ్ల స్వాతంత్ర్యం తరువాత ఒక దళితుడు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఎదగడాన్ని అగ్రకులానికి చెందిన అడ్వకేట్లు జీర్ణించుకోలేకపోతున్నారని వారు మండిపడ్డారు. 'కనకపు సింహాసనమున శునకము..' అంటూ వారు చేసిన వ్యాఖ్యల్ని కేవీపీఎస్ తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. వారిద్దరిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి చట్టం ప్రకారం వారిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. దాంతోపాటు వారిని బార్ కౌన్సిల్ నుంచి తొలగించాలని, న్యాయవాద లైసెన్స్‌ను రద్దు చేయాలని అన్నారు. సాక్షాత్తు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి కూడా అవమానాలేనా, ఆయన దళితుడిగా పుట్టడమే నేరమా అని ప్రశ్నించారు. వారి వెంట బొంగరాల వెంకటయ్య ఉన్నారు.

# మద్యం దుకాణాల్లో ఇతరుల కులాల వారి జోక్యం సహించేది లేదు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నియోజకవర్గ పరిధిలో రిజర్వేషన్ల ప్రాతిపదికన గౌడ్స్‌కు కేటాయించిన మద్యం షాపుల్లో ఇతర కులాలు, ప్రాంతాల పెట్టుబడిదారులు చొరబడితే సహించేది లేదని గౌడ సంక్షేమ సంఘం నాయకులు హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని నిర్మాణంలో ఉన్న గౌడ సంక్షేమ సంఘం భవనం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నియోజకవర్గ అధ్యక్షుడు పెద్ది శ్రీనివాస్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు గుండు శ్రీరాములుగౌడ్‌లు మాట్లాడుతూ వృత్తిపరంగా కల్లుగీత కార్మికులుగా ఉన్న తమ సంక్షేమం కోసం ప్రభుత్వం వైన్‌షాపుల కేటాయింపులోల రిజర్వేషన్ అమలు చేస్తుందన్నారు. కాని ఆర్థికంగా బలంగా లేని తమ నిస్సహాయ స్థితిని ఆసరాగా చేసుకోని కొంతమంది పెట్టుబడిదారులు గౌడ్స్‌ను బినామిగా పెట్టి మద్యం షాపులు దక్కించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాని ఇకపై ఇలాంటి వ్యవహారాలు నియోజకవర్గ పరిధిలో కొనసాగితే సహించేది లేదన్నారు. ఆర్థికంగా బలహీనంగా ఉన్న గౌడ కులస్థులకు మద్యం టెండర్ దక్కినట్లయితే గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దానిలో భాగస్వాములమవుతామని, వచ్చిన లాభాలతో మిర్యాలగూడలో గౌడ కులస్థుల ఉపయోగం కోసం పెద్ద ఎత్తున చేపడుతున్న భవన నిర్మాణానికి , కుల సంక్షేమ సంఘానికి వినియోగించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గుండు నరేందర్‌గౌడ్, జెర్రిపోతుల రాములుగౌడ్, చౌగాని వెంకన్న గౌడ్, ఉదయ్‌భాస్కర్, పందిర్ల అంజయ్యగౌడ్, పెద్ది సైదులుగౌడ్, నర్సింగ్ బలరాంగౌడ్, బోడ పాండుగౌడ్, కొప్పు సత్యంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# చర్చిలపై దాడి చేస్తే ఎంతటివారినైనా ఉపేక్షించం

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్** : చర్చిలపై దాడి చేస్తే ఎంతటి వారైనా ఊరుకునేది లేదని సూర్యాపేట జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు రెవ గడ్డం డేవిడ్ రాజు అన్నారు. సోమవారం పట్టణంలోని నియోజక వర్గ పాస్టర్స్ పెలోషిప్ చైర్మన్ రెవ తలకప్పల సుధాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల గరిడేపల్లి మండలం రంగాపురం గ్రామంలో బెతెస్థ మినిస్ట్రీస్ చర్చిపై దాడికి ప్రయత్నం చేయడం హేయమైన పిరికి చర్య అన్నారు. హిందు క్రైస్తవుల మధ్య విభేదాలు సృష్టించి మతకల్లోలాలు సృష్టించాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. హుజూర్‌నగర్ నియోజక వర్గం మత సామరస్యతకు ప్రతిక అని ఇక్కడ మతకల్లోలకు తావులేదన్నారు. సూర్యాపేట నియోజక వర్గ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు రెవ. జలగం జేమ్స్ మాట్లాడుతూ చర్చిపై రాజకీయం చేయడం దుర్మార్గమైనదని, దేవుని మందిరం జోలికి వస్తే శాపం తగులుతుందన్నారు. ఈ సమావేశంలో సూర్యాపేట జిల్లా సహాయ కార్యదర్శి పాస్టర్ మాతంగి పీటర్, హుజూర్‌నగర్ మండల సీనియర్ పాస్టర్ పాతకోడి ఆమోస్, పాస్టర్ పాతకోటి దేవదానం, పాస్టర్ యల్క ప్రభాకర్, రెవ ఏర్పుల క్రిస్టోఫర్, పాస్టర్ మొరుగురి రూబెన్ పాల్గొన్నారు.





## 51 డప్పులను బహుకరణ

**ప్రజాపక్షం/నూతనకల్** : మండల పరిధిలోని ఎర్రపహాడ్ గ్రామంలోని డప్పు కళాకారులకు 51 డప్పులను గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేయుచున్న సామ సవేందర్ రెడ్డి సోమవారం బతుకమ్మ పండుగ సందర్భంగా గ్రామదేవత అయిన ముత్యాలమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలు తనపై చూపిస్తున్న ఆదరాభిమానాలకు, ఆప్యాయతలకు ముగ్దుడనై గ్రామంలోని డప్పు కళాకారులకు చేయూతనందించాలనే సదుద్దేశంతో వారికి డప్పులను బహుకరించడం జరిగిందని తెలిపారు. ఉపాధ్యాయుని బృహత్తర దాతృత్వాన్ని గ్రామస్తులు కొనియాడుతూ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటి చైర్మన్ ధర్మాలపు వెంకటమ్మ, మాజీ ఉపసర్పంచ్‌లు ఇరుగు వీరస్వామి, ధర్మారపు రాములు, ఇరుగు సాలయ్య, గ్రామ ప్రజలు ధర్మారపు మహేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శిగా రాము

**ప్రజాపక్షం/ రామన్నపేట:** గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రామన్నపేట పట్టణానికి చెందిన నకిరేకంటి రాము ఎన్నికయ్యారు. ఇటీవల భువనగిరిలో జరిగిన జిల్లా మహాసభలో జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర నాయకత్వం పాలడుగు భాస్కర్, పైళ్ల గణపతిరెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తానని, కార్మికుల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## పేదలకు పెద్దపీట



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పేద వర్గాల సమగ్ర అభివృద్ధికి ప్రభు త్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మిర్యాలగూడ మండలం సుబ్బారెడ్డిగూడెం గ్రామానికి చెందిన మంద సంగీతరావుకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.28వేల చెక్కును ఆయన సోమవారం తన కార్యాలయంలో అందచేసి మాట్లాడారు. బడుగు, బలహీనవర్గాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సీఎం సహాయ నిధి పేదలకు వరమన్నారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు గున్‌రెడ్డి బుచ్చిరెడ్డి, మంద సైదులు, తిప్పన రవీందర్‌రెడ్డి, వంగాల కృష్ణారెడ్డి, గజ్జల నర్సిరెడ్డి, రవి, మచ్చ నాగరాజు, మంద రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతకు కంప్యూటర్ స్కిల్స్‌లో ఉచిత శిక్షణ

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండలం జలాల్ పురం గ్రామంలో పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ తెలంగాణ ప్రభుత్వం స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థలో నిరుద్యోగ యువతీ యువకులకు స్వల్పకాలిక రెండు నెలల కంప్యూటర్ స్కిల్స్‌లో ఉచిత శిక్షణ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తుందనీ సంస్థ డైరెక్టర్ ఎన్.కిషోర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత ఆసక్తిగల నిరుద్యోగ యువతీయువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణలో వసతి కల్పించబడునని శిక్షణ కాలం పూర్తి అయిన తర్వాత ఉద్యోగం కల్పించబడునని తెలిపారు. ఇంటర్మీడియట్ పాస్, బేసిక్ కంప్యుటర్స్ అర్హతతో డి.టి.పి, ఇంటర్మీడియట్ అర్హతతో బేసిక్ కంప్యుటర్స్ (డాట ఎంట్రీ ఆపరేటర్) సాంకేతిక కోర్సులో చేరవచ్చని తెలిపారు. అర్హత ఆసక్తి గల అభ్యర్థులు పాస్పోర్ట్ ఫోటో, ఆధార్ కార్డు సర్టిఫికెట్స్ జిరాక్స్ సెట్‌లతో అక్టోబర్ 6వ తేదీ వరకు స్వామి రామానంద తీర్థలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9948466111, 9133908222, 9133908111, 9133908000 ఫోన్ నెంబర్లకు గాని సంబంధిత వెబ్సైట్ను సంప్రదించాలని కోరారు.



## ఆర్‌ఓ ప్లాంట్ ప్రారంభం

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలోని 2వ వార్డు తాళ్లసింగారం కొత్తపేట కాలనీ లో దివిస్ వారి సహకారం రూ.5,36,000లతో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్‌ను సోమవారం చౌటుప్పల్ మున్సిపల్ కమీషనర్ గుత్తా వెంకట్ రాంరెడ్డి మరియు దివిస్ జనరల్ మేనేజర్ పెండ్యాల సుధాకర్‌ల చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు సుర్వి నర్సింహ గౌడ్, గుత్తా శ్రీధర్ రెడ్డి, మారుపాక నర్సింహ గౌడ్, కొనసమ్ రాంరెడ్డి పాల్గొన్నారు.

## గంజాయి రహిత సమాజం కోసం యాత్ర



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** గంజాయి, డ్రగ్స్ రహిత సమాజం కోసం రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన జనచైతన్య బైక్ యాత్ర సోమవారం మండల కేంద్రానికి చేరుకుంది. సుమారు 1400 కిలో మీటర్లు వివిధ జిల్లాలలో తిరిగి యువతను, ప్రజలను జన చైతన్యం చేసి మత్తు పదార్థాలు, మాదాక ద్రవ్యాలు తీసుకోవడంతో జరిగే అనర్థాలను వివరించడం జరిగిందని బైక్ యాత్రికుడు రావకొండ ప్రభాకర్ అన్నారు. యువత ఒక ల క్ష్యాన్ని ఏర్పర్చుకొని జీవితంలో స్థిరపడాలని అన్నారు.

## నూతన కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** మున్సిపాలిటీ పరిధిలోని రెవెన్యూ గ్రామంలో ఉన్న నవభారత్ అసోసియేషన్ సోమవారం ఏకగ్రీవంగా నూతన కమిటిని ఎన్నుకున్నారు. సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు కొంగం కిషోర్ సలహాదారులు కైరంకొండ సాగర్ చిలువేరు రాజు ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలలో అధ్యక్షులుగా కొంగం వినోద్ కుమార్, ఉపాధ్యక్షులుగా బత్తుల చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా వేముల ఏలేందర్, కోశాధికారిగా రచ్చ బాలిరాజ్, సహాయకార్యదర్శిగా ఎస్.కె షఫీ, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా సూరెపల్లి రామేశ్వరం, వేముల నరేష్, ఎస్.కె గౌస్ పాషా బత్తుల విగ్నేశ్వర్, కొంగరి ప్రవీణ్, నాగరాజ్‌లు ఎన్నికయ్యారు.

## 8వ రోజున సరస్వతి దేవి

**ప్రజాపక్షం/ఆత్మకూర్(యం):** మండల కేంద్రంలో శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ఎనమిదవ రోజు అమ్మవారు శ్రీ సరస్వతీ దేవిగా దర్శనం ఇచ్చారు. ఆలయ ధర్మకర్త లు ఏనుగు సుగంధిని సురేందర్ రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు అంభిత్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ భక్తులు లోడి శంకర్ రోహిణి, మనోహర్ లాల్ ఎద్దు మత్యగిరి, కోల లక్ష్మయ్య, గట్టు విశాల్ సూర్య మహేశ్, బండారి సాయి కృష్ణ, లోడి ప్రదీప్, ధనరాజ్, పవన్ పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి



**ప్రజాపక్షం/యాదాద్రి :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల ప్రజల నుండి 31 ఆర్జీలను, జిల్లా కలెక్టర్, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి, స్థానిక సంస్థలు కలెక్టర్ భాస్కరరావుతో కలిసి ఆర్జీలను స్వీకరించారు. అందులో రెవిన్యూ శాఖ 25, జిల్లాపంచాయతీ మున్సిపాలిటీ, సర్వే ల్యాండ్, హౌసింగ్, వైద్య, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. వివిధ శాఖలకు వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిశీలించి ప్రజల సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి జయమ్మ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, హౌసింగ్ పిడి విజయసింగ్ పాల్గొన్నారు.

## లైసెన్స్ ల్యాండ్ సర్వేయర్లుగా శిక్షణ పూర్తి



**ప్రజాపక్షం/మునగాల:** తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన లైసెన్స్ ల్యాండ్ సర్వేయర్లుగా గుర్తింపు పొంది శిక్షణ పూర్తి చేసుకున్న సర్వేయర్లు సోమవారం మునగాల తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ సరితను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానం చేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ సరిత మాట్లాడుతూ సర్వేయర్లుగా శిక్షణ పూర్తి చేసుకున్న సర్వేయర్లు పూర్తిస్థాయిలో గ్రామాలలో భూముల కొలతల విషయంలో పూర్తిస్థాయిలో వారి సేవలను వినియోగించు కుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ సర్వేయర్లు ఈట ప్రశాంత్, గోపినాథ్‌రెడ్డి, వంశీ, శ్రీశైలం, రాజేష్, నరేష్, సాయితేజ, రాజేష్, అక్షయ, అరుణ పాల్గొన్నారు.

## పూర్తిగా వెనుకబడిన చేనేత సహకార సంఘం



**ప్రజాపక్షం/ రామన్నపేట:** 51 ఎంక్వయిరీ పేరుతో పాలకవర్గాన్ని రద్దు చేయడం ద్వారా ఏడు సంవత్సరాలు సిరిపురం చేనేత సహకారం సంఘం పూర్తిగా వెనుకబడిపోయిందని దాన్ని పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేస్తున్నామని సిరిపురం చేనేత సహకార సంఘం పర్సన్ ఇన్‌చార్జి అప్పం రామేశ్వరం అన్నారు. సోమవారం గ్రామంలో సంఘం సాధారణ సమావేశం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. సంఘాలు బలోపేతంకావాలంటే చేనేత వృత్తిదారులు బాధ్యతగా పనిచేయాలన్నారు. తద్వారా వృత్తిదారులకు, చేనేత కార్మికులకు సకాలంలో డబ్బులు అందుతాయని, దీంతో సంఘం బలోపేతం అవుతుందన్నారు. ప్రభుత్వం టెస్కో ద్వారా సంఘాల్లో ఉన్న వస్త్రాలను ఎప్పటికప్పుడు కొనుగోలు చేసి డబ్బులు అందచేయాలని అన్నారు. మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా నూతన డిజైన్లు రూపొందించి పారిశ్రామికులకు అందించాలని, విస్తృత మార్కెట్ సౌకర్యం కల్పించాలని కోరారు. చేనేతకు జీఎస్టీని పూర్తిగా రద్దు చేయాలని, చేనేతకు మాత్రమే జియో ట్యాగ్ వేయడం సరికాదని అన్నారు. కార్యక్రమంలో పున్నా రామలింగం, రాపోలు నరసింహ, రాపోలు వీరమోహన్, బడుగు రమేష్, పున్నా వెంకటేశం, మిర్యాల భాస్కర్, రాపోలు స్వామి, రాపోలు లక్ష్మమ్మ, జెల్లా లక్ష్మీ నారాయణ, ఏలె నర్సింహ, పాపయ్య, రమేష్, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కనకదుర్గాదేవి పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ సత్యం



**ప్రజాపక్షం/మునుగోడు:** మండలంలోని రత్తిపల్లి,గంగూరి గూడెం మునుగోడు గ్రామాలలో ఏర్పాటుచేసిన కనకదుర్గాదేవికి ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండపం కమిటీ సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. మండల కేంద్రంలో శివరామ క్షేత్రంలో ఏర్పాటుచేసిన కనకదుర్గాదేవి సరస్వతి అవతారం సందర్భంగా విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేవి నవరాత్రి ఉత్సవాలు ప్రతి ఒక్కరు భక్తిశ్రద్ధలతో నిర్వహించాలన్నారు. ఆయన వెంట సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గురజా రామచంద్రం, తీర్పారి వెంకటేశ్వర్లు, బొల్గూరి నరసింహ, సురిగి చలపతి, మండల కార్యదర్శి చాపల శ్రీను, ఉప్పునూతల రమేష్,ఈదులకంటి కైలాస్, గోస్కొండ లింగయ్య, బొల్గూరి వంశీ, కట్కూరి లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## బిఎస్‌పి నూతన జిల్లా అధ్యక్షుడిగా గంధమల్ల లింగస్వామి



**ప్రజాపక్షం/మోటకొండూరు :** యాదాద్రి భువనగిరి జిల్లా బహుజన సమాజ్ పార్టీ (బిఎస్‌పి)నూతన జిల్లా అధ్యక్షుడుగా గంధమల్ల లింగ స్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం ఉమ్మడి నల్గొండ జిల్లా బీఎస్పీ, సెంట్రల్, రాష్ట్రస్థాయి సమావేశం నకిరేకల్ శుభం గార్డెన్స్‌లో నిర్వహించారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రహీం చేతుల మీదుగా నియామక పత్రం అందజేశారు. 2019లో సామాన్య కార్యకర్తగా బీఎస్పీ పార్టీలో చేరి వార్డు సభ్యులుగా గెలిచి మండల, నియోజకవర్గ, జిల్లా ఉపాధ్యక్షులు, పార్టీ ఇంఛార్జిగా పార్టీలో పదవులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ప్రజా సమస్యలపై పోరాడుతూ పార్టీని బలోపేతం చేస్తానని అన్నారు. బడుగు, బలహీన వర్గాల రాజ్యాధికారం ధ్యేయంగా బీఎస్పీ పార్టీ పనిచేస్తుందని అన్నారు. జిల్లా అధ్యక్షులుగా ఎన్నికకు సహకరించినా పార్టీ నాయకులు, కార్యకర్తలకు శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు.

## పుస్తకాలు, పెన్నులు పంపిణీ



**ప్రజాపక్షం/భూదన్ పోచంపల్లి :** పట్టణంలో అభినవ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సోమవారం సరస్వతీ దేవి అవతారం అమ్మవారి మూల నక్షత్రాన్ని పురస్కరించుకొని విద్యా సరస్వతి అనుగ్రహ కటాక్షం అనే కార్యక్రమం ద్వారా శ్రీ మద్దెలమ్మ దేవాలయంలోసంయుక్తంగా పద్మనగర్ దుర్గామండపంలోనూ చిన్నారులకు అక్షరాభ్యాస పిల్లలకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ మద్దెలమ్మ దేవస్థానం అధ్యక్షులు సూరపల్లి రాము, అభినవ యూత్ అధ్యక్షులు జోగు రవీందర్, పుస్తకాల సంయుక్త ధాత రచ్చ రమేష్, యూత్ ప్రధాన కార్యదర్శి వేముల నరేష్, సహాయ కార్యదర్శి మహేశ్వరం ప్రసాద్, సాంస్కృతిక కార్యదర్శి బిజ్జ బాలకృష్ణ, వర్కాల గణేష్, దేవాలయ కార్యవర్గం సభ్యులు పద్మనగర్ దుర్గ కమిటీ కార్యవర్గం తదితర భక్తులు పాల్గొన్నారు.

## జడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికలకు సన్నద్ధం



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలకు సన్నద్ధం కావాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షులు జనగాం పాండు అన్నారు. బీఆర్‌ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో భువనగిరి మండల బిఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం మండల పార్టీ అధ్యక్షులు జనగాం పాండు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జనగాం పాండు మాట్లాడుతూ భువనగిరి మండల జడ్పిటిసి, ఎంపిటీసీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించే దిశగా నాయకులు కార్యకర్తలు పార్టీ శ్రేణులు కృషి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పిటిసి సుబ్బూర్ బీరు మల్లయ్య, మాజీ ఎంపీపీ అతికం లక్ష్మీ నారాయణ గౌడ్, బిఆర్‌ఎస్ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి నీల ఓంప్రకాష్ గౌడ్, మాజీ సింగిల్ విండో చైర్మన్లు ఎడ్ల సత్తిరెడ్డి పాల్గొన్నారు.

## పాలేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలి



**ప్రజాపక్షం/మాడుగుల పల్లి:** మాడ్గులపల్లి మండలం ఆగామోత్కూర్ పాలేరు వాగుపై నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిని వెంటనే పూర్తి చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సిపిఎం నాయకులు,రైతులతో కలిసి బ్రిడ్జిని పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చివరి దశలో బ్రిడ్జి నిర్మాణానికి బడ్జెట్ సరిపోలేదనే కారణంతో అర్థాంతరంగా నిలిపివేయడం సరైన పద్ధతి కాదని,మిగతా బడ్జెట్ టెండర్ ప్రక్రియ పూర్తి చేసి వెంటనే నిధులు మంజూరు చేసి బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని కోరారు.బ్రిడ్జి లేకపోవడం వల్ల వర్షాలు వచ్చినప్పుడు వరదల కారణంగా రాకపోకలు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని,ముఖ్యంగా రైతులు,గీత కార్మికులు బ్రిడ్జి దాటి పోయే పరిస్థితి లేకపోవడం వలన చుట్టూ 5 కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్,మండల నాయకులు దేవిరెడ్డి అశోక్ రెడ్డి,పుల్లెంల శ్రీకర్,చారి,పతాని శ్రీను,శాఖ కార్యదర్శి బంటు రాజు,రైతులు అండెం గిరి,బంటు సైదులు పాల్గొన్నారు.



## సరస్వతీ అలంకరణతో దర్శనం

**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** మండలంలోని మాండ్ర గ్రామంలోలారి అసోషియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారు సరస్వతి అలంకరణతో అమ్మదర్శనం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అర్చకులు బ్రహ్మశ్రీఉత్తరపల్లి నరసింహచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు గణపతి పూజ నవగ్రహ మండపం అమ్మవారికి అష్టోత్తర శతనామావళి పూజ తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. తరువాత బట్టు క్రిష్ణయ్య పార్వతమ్మ ఆగు యాదయ్య జ్యోతి దంపతులు విద్యార్థులకు నోటుబుక్స్ పెన్నులు పంపిణి చేశారు. ఈకార్యక్రమంలో భవాని మాత మాలధారణస్వాములు తరాల శ్రీనివాస్ మల్లె బోయిన రామలింగయ్య మల్లె బోయిన సత్తయ్య గురిజ సాయి శివ మల్లె బోయిన వెంకటెశ్వర్లు (అద్వాని) యాళ్ళ భూపతి రెడ్డి విద్యార్థులుభక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం/ఆత్మకూరు (యం) :** మండలంలోని కొరటికల్ గ్రామం మధిర ఇప్పల్లలో బిఆరెస్ పార్టీ కార్యకర్త పంజాల యాదయ్య గౌడ్ అనారోగ్య కారణంగా మరణించగా వారి కుటుంబానికి బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు బీసు చందర్ గౌడ్, కూరెళ్ల గ్రామ తాజా మాజీ సర్పంచ్ భాషబోయిన ఉప్పలయ్య యాదవ్, కొరటికల్ గ్రామ తాజా మాజీ సర్పంచ్ కోల సత్తయ్య గౌడ్ సహకారంతో రూ.5000 ఆర్థిక సహాయాన్ని గ్రామ శాఖ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు నరుకుడు బిందెల సైదులు, మాజీ సర్పంచ్ పెండెం పురుషోత్తం, మోత్కూరు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సోలిపురం లక్ష్మారెడ్డి, మండల కార్యదర్శి రాంరెడ్డి పాల్గొన్నారు.

## నిరుపేద విద్యార్థికి చేయూత

**ప్రజాపక్షం/చండూరు:** మండల పరిధిలోని గుండ్రపల్లి గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన కురుపాటి పరుశురాం చండూరు మున్సిపాలిటీలోని మరియానికేతన్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. పరుశురాం పాఠశాలకు ప్రతి రోజు రోడ్డు పై వెళ్లే ద్విచక్ర వాహనం ఆపి వారి బైక్‌పై పాఠశాలకు వెళ్లి చదవుతూ ఇబ్బందులు పడుతున్న బాధను టీఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొబ్బల వెంకట్ రామ్ రెడ్డి (టామ్ రెడ్డి) సోషల్ మీడియా ద్వార తెలుసుకున్నాడు. కురుపాటి పరుశురాం కుటుంబం ఆర్థిక పరిస్థితి బాగలేనందున పాఠశాలకు వెళ్లుటకు ఒక సైకిల్ కావాలని కోరిన వెంటనే వెంకట్ రామ్ రెడ్డి పరుశురాం కు కొత్త సైకిల్‌ను అందజేశారు.



## చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నేత్రాలు సేకరణ..



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ఖమ్మం జిల్లా గుడిమల్ల గ్రామానికి చెందిన చేకూరి తిరుపయ్య సోమవారం మృతి చెందారు. వీరి కుటుంబ సభ్యుల అనుమతితో లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ చారిటబుల్ ట్రస్ట్ ఐ డొనేషన్ సెంటర్ వారు నేత్రాలను సేకరించడం జరిగింది. అదేవిధంగా నల్లగొండ పట్టణంలోని రాక్ హిల్స్ కాలనీ ప్రాంతానికి చెందిన గంట సుధ, శ్రీరామ్ నగర్ ప్రాంతానికి చెందిన,గాదె కొండల్ రెడ్డి మృతి చెందారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యుల అనుమతితో వారి నేత్రాలను సేకరించారు. ఈ సందర్భంగా క్లబ్ ,ట్రస్ట్ చైర్మన్ లయన్ కెవి ప్రసాద్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ హరనాథ్ కడిమి, మేనేజర్ డాక్టర్ పుల్లారావు లు మాట్లాడుతూ ఈ నేత్రదాన కార్యక్రమానికి సహకరించిన ముగ్గురి కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.ఇప్పటి వరకు ఈ నేత్రదానాల ద్వారా సేకరించిన 396 కార్నియా అనుకంటి పొరల ద్వారా 396 మందికి పైగా కార్నియల్ అంధులకు కంటిచూపును ప్రసాదించే మహోన్నతమైన అవకాశం కలిగిందన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు డాక్టర్ ప్రనూష,డాక్టర్ నితీషా,ఐఎంఎ ప్రెసిడెంట్ డాక్టర్ దామర యాదయ్య, కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్, కోఆర్డినేటర్లు కోట సరిత, చంద్రశేఖర్ చిరునోముల తదితరులు ఉన్నారు.

## రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు విజయవంతం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో ఈనెల 25న నిర్వహించిన బతుకమ్మ సంబరాలను విజయవంతం చేసిన మహిళా కు సహకరించిన వివిధ పార్టీల నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని రెడ్డి జాగృతి మహిళా జిల్లా అధ్యక్షురాలు మందడి సంధ్యా రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండలోని కృతుంగా హోటల్లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో తెలంగాణ సంస్కృతి సంప్రదాయానికి ప్రతికైన బతుకమ్మ సంబరాలకు తీరొక్క పూలతో వివిధ కాలనీల నుండి బతుకమ్మలను పేర్చి ఎన్జీ కళాశాల మైదానం కి బతుకమ్మలతో ర్యాలీగా వచ్చి విజయవంతం చేశారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో రెడ్డి జాగృతి జిల్లా అధ్యక్షులు గాదె సైదిరెడ్డి,యువజన అధ్యక్షుడు మైల మురళీధర్ రెడ్డి, మహిళలు కందిమల్ల నాగమణి రెడ్డి ,కోమటిరెడ్డి అరుణ, బుచ్చిరెడ్డి ,యాస సరళ రెడ్డి ,జినుగు జ్యోతి రెడ్డి, నామిరెడ్డి శ్రీలత రెడ్డి, మైల జ్యోతి, బోధనపు శోభ,అలుగుబెల్లి వెంకటరెడ్డి, కంచరకుంట్ల వెంకటరెడ్డి పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్‌లో ఎస్‌సిలకు తీవ్ర అన్యాయం...

**కలెక్టర్, ఆర్డీవోలకు వినతి పత్రాలు సమర్పణ**



**ప్రజాపక్షం/దేవరకొండ;** తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల కోసం విడుదలైన రిజర్వేషన్ల జాబితా దేవరకొండ నియోజకవర్గంలో పెను రాజకీయ తుఫానును సృష్టిస్తోంది. నియోజకవర్గంలోని షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) ప్రజలకు ప్రాతినిధ్యం లేకుండా, వారి హక్కులను కాలరాసే విధంగా రిజర్వేషన్లను రూపొందించారని ఆరోపిస్తూ, వివిధ ఎస్సీ సంఘాల నాయకులు సోమవారం తమ తీవ్ర నిరసనను వ్యక్తం చేశారు. దేవరకొండ ఆర్డీవో కార్యాలయంలో ఆందోళన వ్యక్తం చేయడంతో పాటు నల్గొండ జిల్లా కలెక్టర్‌కు సైతం తక్షణమే రిజర్వేషన్లను చట్టబద్ధంగా సవరించి, ఎస్సీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ వినతి పత్రాన్ని సమర్పించారు. ఎస్సీ నాయకులు వెల్లడించిన గణాంకాల ప్రకారం దేవరకొండ నియోజకవర్గంలో ఎస్సీ జనాభా దాదాపు లక్ష వరకు ఉందని, ఇక్కడ ఓటర్ల సంఖ్య కూడా యాభై వేలకు పైగానే ఉందని నిబంధనల ప్రకారం జనాభా నిష్పత్తిని బట్టి రిజర్వేషన్లు కేటాయించాల్సి ఉండగా ఈ కీలక జనాభా విభాగానికి పూర్తిగా మొండిచేయి చూపడం రాజకీయంగా, సామాజికంగా కలకలం సృష్టిస్తోంది. నియోజకవర్గంలో ఎనిమిది మండలాల పరిధిలోని మండల పరిషత్ అధ్యక్షులు (ఎంపిపి), జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు (జెడ్పిటిసి) స్థానాలను కలిపితే మొత్తం 16 కీలక పదవులు ఉండగా ఈ పదహారు సీట్లలో ఒక్క స్థానాన్ని కూడా ఎస్సీలకు రిజర్వు చేయకపోవడం అత్యంత దారుణమని సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపిపి, జెడ్పిటిసి పదవులు స్థానిక అభివృద్ధి, నిధుల కేటాయింపులో కీలక పాత్ర వహిస్తాయి కాబట్టి వాటిని పూర్తిగా ఎస్సీలకు దూరం చేయడం పట్ల వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిదిలోని కనీసం ఒక్క ఎంపిటిసి స్థానాన్ని కూడా ఎస్సీలకు రిజర్వ్ చేయకుండా, కింది స్థాయి ప్రాతినిధ్యాన్ని సైతం అడ్డుకోవడం దారుణమని ఎస్సీ నాయకులు పేర్కొన్నారు. ఈ వ్యవహారాన్ని జిల్లా కలెక్టర్‌తో పాటు, రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా సిరియస్‌గా తీసుకొని న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. వినతిపత్రంపై జిల్లా ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారు, రిజర్వేషన్లలో సవరణలు జరుగుతాయా లేదా అనే ఉత్కంఠ నియోజవర్గంలో కొనసాగుతుందని నాయకులు తెలిపారు. ఈకార్యక్రమంలో డా. ఏకుల రాజారావు, నర్సింహా, కృష్ణ, సురేష్, మురళి, ఆనంద్, వెంకటయ్య, దినకర్, సైదులు, విజయ్ పాల్గొన్నారు.



## యువత స్వశక్తితో ఎదగాలి

**ప్రజాపక్షం/మునుగోడు:** యువత స్వయం కృషితో స్వశక్తిగా ఎదగాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం అన్నారు. సోమవారం మండల కేంద్రానికి చెందిన మద్ది రవి కి చెందిన మల్లికార్జున స్వీట్స్ అండ్ బేకరీ దుకాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యతతో కూడిన స్వీట్లు అందించి వారి నుండి మననలు పొందినప్పుడే వ్యాపార రంగంలో అభివృద్ధి చెందారన్నారు.ఆయన వెంట మాజీ ఎంపిపి మాజీ కర్నాటి స్వామి, తీర్పారి వెంకటేశ్వర్లు, బొల్గూరి నరసింహ, సురిగి చలపతి, మండల కార్యదర్శి చాపల శ్రీను, గోస్కొండ లింగయ్య, మిర్యాల వెంకన్న, సాగర్ల లింగస్వామి,కట్కూరి లింగస్వామి తదితరులు ఉన్నారు.

## సెల్ఫీ మోజులో ప్రాణాల మీదికి!

**ప్రజాపక్షం/నందికొండ:** సాగర్ ప్రాజెక్టు గేట్లు తెరిచిన సందర్భంగా పర్యాటకుల తాకిడి అధికంగా ఉండటంతో సెల్ఫీ మోజులో ప్రాణాల మీదికి తెచ్చుకున్న సందర్భాలు గతంలో అనేకం, ముఖ్యంగా ప్రమాదకరమైన ప్రదేశాలలో సెల్ఫీలు తీసుకునే ప్రయత్నంలో చాలామంది మరణించిన దర్భాలు కొన్ని అయితే తీవ్రంగా గాయపడిన సందర్భాలు అనేకం నదుల వద్ద ప్రమాదకరమైన ప్రదేశాలలో, సెల్ఫీలు తీసుకోవడం ప్రాణాంతకం అని తెలిసినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు కొందరు పర్యాటకులు. దసరా సెలవులు సందర్భంగా నాగార్జునసాగర్ కు పర్యటకుల తాకిడి పెరగటంతో అనేక మంది పర్యాటకులు కూలిపోయిన పాత బ్రిడ్జి వద్ద ఆరు లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం ఉధృతంగా ప్రవహిస్తున్న ప్రదేశంలో అతి సమీపానికి చేరుకుని సెల్ఫీలు దిగుతూ ఉండటం చూసిన వారిని విస్మయానికి గురి చేసింది.నది ఒడ్డున సెల్ఫీ తీసుకుంటుండగా కాలు జారి నీటిలో పడి కొట్టుకుపోయిన ఘటన ఒక నెల క్రితం కొత్త బ్రిడ్జ్ వద్ద చోటు చేసుకోవడం గమనార్హం. ప్రమాదం జరగకముందే పర్యాటకులు ఎవరు ఉధృతంగా ప్రవహిస్తున్న నీటి వద్దకు వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## బాల్యవివాహాల రహిత భారతదేశం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ముందుండి పనిచేస్తున్నాం మని ప్రతి పిల్లలకు చదువుకోవడానికి, ఎదగడానికి అవకాశాలను ఇచి బాల్యవివాహాలను నిర్మూలించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని,2030 నాటికి బాల్యవివాహాలను పూర్తిగా నిర్మూలించడానికి జాతీయ బాల్యవివాహ వ్యతిరేక దినోత్సవాన్ని ఏర్పాటు చేయాలని అశ్రీత ఎన్‌జిఓ డైరెక్టర్ ఎస్ నాగరాజు అన్నారు.బాల్యవివాహల నిర్మూలన పై అశ్రీత సంస్థ జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ సహకారంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో బాల్యవివాహాలు గణనీయంగా తగ్గాయి. అమ్మాయిల బాల్యవివాహాలు 69శాతం తగ్గగా, అబ్బాయిల బాల్యవివాహాలు 72 శాతం తగ్గాయని తాజా నివేదిక వెల్లడించింది. అదేవిధంగా టిప్పింగ్ పాయింట్ టు జీరో ఎవిడెన్స్ టువార్డ్స్ ఏ చైల్డ్ మారేజ్ ఫ్రీ ఇండియా అనే నివేదికను జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ విడుదల చేసిందని తెలిపారు.ముఖ్యంగా అరెస్టులు,ఎఫ్ఐఆర్‌లు బాల్యవివాహాలకు బలమైన నిరోధకాలుగా ఉన్నాయని తెలిపారు.దేశంలో అస్సాం రాష్ట్రం అమ్మాయిల బాల్యవివాహాలను 84శాతం వరకు తగ్గించడంలో ముందంజలో ఉంది. మహారాష్ట్ర, బీహార్ 70శాతం చొప్పున, రాజస్థాన్ 66శాతంకర్ణాటక 55శాతం తరువాతి స్థానాల్లో నిలిచాయన్నారు.అర్షిత ఎన్‌జిఓ అనే జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ భాగస్వామి, జిల్లాలో జిల్లా పరిపాలన, గ్రామ పెద్దలు కమ్యూనిటీ వర్కర్లతో కలిసి బాలల రక్షణ కోసం పని చేస్తోందని ఈసంస్థ గత మూడు సంవత్సరాల్లో ఎన్నో బాల్యవివాహాలను నివారించిందని 250కి పైగా ఎన్‌జిఓలతో కూడిన అతి పెద్ద నెట్‌వర్క్ అయిన జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ దేశవ్యాప్తంగా 451 జిల్లాల్లో బాలల రక్షణ కోసం పనిచేస్తోందని తెలిపారు.



# వృత్తి విద్యనభ్యసించే విద్యార్థులు నైపుణ్యాన్ని పెంచుకోవాలి

**- రుద్రంపూర్ ఎటిసి ప్రారంభోత్సవంలో ఎంఎల్ఏ కూనంనేని**




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** వృత్తి విద్యాకోర్సులు అభ్యశించే విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం కాకుండా వృత్తి నైపుణ్యాన్ని పెంచుకునే దిశగా శ్రమించాలని, అప్పుడే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయని ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. చుంచుపల్లి మండల పరిధిలోని రుద్రంపూర్ ఏరియా, 5 ఇంక్లైన్‌నో అధునాత సాంకేతిక కేంద్రం (ఏటీసీ)ని సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ వృత్తి విద్యను అభ్యశించే విద్యార్థుల సామర్థ్యాలు పెంచేందుకు ఏటీసీలు దోహదపడతాయన్నారు. గ్రామీణ ప్రాంతాల యువతకు, విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని అన్నారు. ఐటిఐలను ఏటీసీలుగా మారుస్తూ విద్యార్థులను సాంకేతిక రంగంలో ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తాము స్వాగతిస్తున్నట్లు చెప్పారు. ఇది నైపుణ్య శిక్షణ విస్తరణలో ఒక కీలక అడుగని అభినందించారు. ఏటీసీల ద్వారా యువతకు పారదర్శకమైన శిక్షణను అందించడం వల్ల రాష్ట్రం టెక్నాలజీ హబ్‌గా అభివృద్ధి సాధిస్తుందని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ గొప్ప అవకాశాన్ని యువకులు సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు సలిగంటి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, జిల్లా సమితి సభ్యులు వంగా వెంకట్, వట్టికొండ మల్లిఖార్జున రావు, నాయకులు తోట రాజు, ప్రిన్సిపల్ గోనెల రమేష్, సిబ్బంది శోభన్‌బాబు, బి రాము, నర్మద, చెన్ను సామ్యేల్ లక్కీ తదితరులు పాల్గొన్నారు.





## ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

**ప్రజాపక్షం/అర్వపల్లి :** మండలంలో సద్దుల బతుకమ్మ వేడుకను సోమవారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా రంగు రంగుల పూలతో పేర్చిన బతుకమ్మలను గ్రామ కూడల్లో పెట్టి మహిళలందరూ తమ ఆటపాటలతో సందడి చేశారు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో సోమవారం సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీమణి గుంటకండ్ల సునీతాజగదీష్ రెడ్డి మాజీ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, హిందు, ముస్లీం, క్రైస్తవ మహిళలతో కలిసి పాటలుపాడుతూ సద్దుల బతుకమ్మను పేర్చారు. అనంతరం ఆడి పాటి నీటిలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సద్దుల బతుకమ్మ వేడుకలు తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి నివాసంలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. పటేల్ రమేష్‌రెడ్డి సతీమణి పటేల్ లావణ్య రెడ్డి పట్టణ మహిళలతో కలిసి బతుకమ్మలను పేర్చి గౌరమ్మ తల్లికి పూజలు చేసి సాంప్రదాయ పల్లె పాటలతో సద్దుల బతుకమ్మను ఆరాధించారు. రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలతో ప్రాంగణం ఆహ్లాదకరంగా మారింది. అనంతరం మహిళలు ఉత్సాహంగా ఆడుతూ పాడుతూ బతుకమ్మలను నిమజ్జనం చేశారు. ఈ వేడుకల్లో చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/నూతనకల్ :** మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని ఆయా గ్రామాలలో సద్దుల బతుకమ్మ పండగ వేడుకలను ప్రజలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగు రంగుల పూలను కోసుకొచ్చి బతుకమ్మను పేర్చి ఇంట్లో గౌరీమాతను నెలకొల్పి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల వ్యాప్తంగా సోమవారం సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలు ఉదయాన్నే నూతన వస్త్రాలు ధరించి, తీరొక్కపూలతో బతుకమ్మను పేర్చి, మహిళలంతా ఒక దగ్గర చేరి బతుకమ్మ ఆట, పాటలతో కోలాహలంగా బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించుకొని అనంతరం బతుకమ్మను చెరువులో నిమజ్జనం చేశారు.



**ప్రజాపక్షం/మోటకొండూరు :** మోటకొండూర్ మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలలో సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మోటకొండూరు బస్టాండ్ ఆవరణలో మాజీ సర్పంచ్ వడ్డబోయిన శ్రీలత ఆధ్వర్యంలో పెద్ద బతుకమ్మను ఏర్పాటు చేసి సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు.



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** మండలంలోని వాసాల మర్రి గ్రామంలో అత్యంత వైభవంగా జరిగిన బతుకమ్మ సంబరాలు వేడుకలో మాజీ వైస్ ఎంపీపీ, మాజీ ఎంపీటీసీ పలుగుల నవీన్ కుమార్ ఉమారాణి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. పూల పండుగ బతుకమ్మ వేడుకలో గ్రామ ఆడపడుచులు, మహిళలతో కలిసి బతుకమ్మలు ఆడి పాడారు.

# మోరంపల్లిబంజర్‌లో భారీగా పట్టుబడ్డ గంజాయి

**-పోలీసుల అదుపులో నిందితుడు**



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** మండల పరిధిలోని మోరంపల్లిబంజర్ ఫారెస్ట్ చెక్ పోస్ట్ ప్రాంతంలో సోమవారం భారీగా గంజాయి పోలీసులకు పట్టుబడింది. హర్యానా రిజిస్ట్రేషన్‌కు చెందిన కారులో గంజాయి తరలిస్తుండగా బూర్గంపాడు పోలీసులకు విశ్వసనీయ సమాచారం మేరకు బంజరు గ్రామంలో పట్టుకొని విచారణ చేపట్టారు. ఇది ఇలా ఉండగా భద్రాచలం బ్రిడ్జి సెంటర్ వద్ద ఉన్నటువంటి చెక్ పోస్ట్ దాటి గంజాయి తరలి వెళ్లడంపై పలు అనుమానాలు రేకెత్తిన్నాయి. భద్రాచలం దాటి బూర్గంపాడు మండలం దాటి తరలి వెళ్లాలంటే స్థానిక మండలానికి చెందిన పాత్ర ఉన్నట్టా లేనట్టా అనే సందేహాలు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఒరిస్సా, ఛత్తీష్‌ఘడ్ నుండి భద్రాచలం చేరుకొని బూర్గంపాడు మండలానికి రావడానికి ఎలాంటి రెక్కీ లేకుండా, ఎవరి పాత్ర లేకుండా తరలి వెళ్లాలంటే ఇబ్బందులతో కూడుకున్న విషయమే గంజాయి రవాణా విషయంలో బూర్గంపాడు మండలానికి చెందిన వారి పాత్ర ఉంటే వారి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా ఉంటుందన్నే సందేహం లేకపోలేదు. అసలు మండలానికి చెందిన వారు గతంలో గంజాయి రవాణాలో చక్రం తిప్పిన వారే ఉండి ఉంటారన్న వాదనలు కూడా గట్టిగా వినపడుతున్నాయి. చెక్ పోస్ట్‌లో పని చేస్తున్న అధికారుల పరిచయాలు ఉన్న వ్యక్తులే ఈ రవాణాకు ప్రధాన పాత్ర పోషిస్తున్నారే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏదిఏమైనప్పటికీ గంజాయి రవాణాకు పోలీసు శాఖ వారు పట్టుకోవాలంటే అట్టి రవాణా జరుగుతున్న తీరు పూర్తి సమాచారం ఉంటే తప్ప నిలువరించే ప్రయత్నాలు చేయటం కష్ట సాధ్యమే నంటూ పలువురు అభిప్రాయపడుతున్నారు. సారపాక కేంద్రంగా గంజాయి రవాణా చేసే వ్యక్తులు, మండలానికి చెందిన మరి కొన్ని ప్రాంతాలకు చెందిన వారు పాత్రలపై కూడా ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపడితే కొంత మేరకు గంజాయి రవాణా అరికట్టేందుకు మార్గాలు దొరుకుతాయని పలువురు తెలుపుతున్నారు. గంజాయి రవాణా, గంజాయికి బానిసలుగా అవుతున్న తీరుపై పూర్తిస్థాయిలో ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి అరికట్టాలని మండల ప్రజలతో పాటు పలువురు మేధావులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

# ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ పండుగ



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవం సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక బతుకమ్మ పండుగ అని గోళ్ల శ్రీనివాస్ రావు, బాలిన కృష్ణంరాజు అన్నారు. సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా సోమవారం మండల లోని భైరవునిపల్లి గ్రామంలో మిత్రపక్షాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మహిళలు సమిష్టిగా బతుకమ్మ ఆడటం వల్ల సాంఘిక ఐక్యతా బలపడుతుంది అని అన్నారు. పకృతి ప్రసాదించిన తంగేడు,గునగ బంతి మరియు రంగు రంగుల పూలతో బతుకమ్మను అలంకరించి మహిళలు ఆట పాటలతో పండుగా చేసుకోవడం కన్నులపండుగగా ఉంది తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కనకబండి సీతారాములు, గుండపనేని లక్ష్మణరావు, కనకబండి రామయ్య,నూక హనుమంత రావు, మరికంటి రమేష్, పోలంపల్లి నారాయణ, గండు సైదులు, ముత్యాల వేంకటేశ్వరరావు, మల్లేబోయిన శ్రీనివాస్ రావు, మరికంటి ఉమారాణీ, బుర్ర విజయమ్మ, చిలివేరు రేణుబాబు, బుర్ర నాగభూషణం, గోపి ఉపేందర్, ఆలేటి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# భద్రాచలం-వాజేడు ప్రధాన రహదారి నిర్మాణంకై సిపిఎం పాదయాత్ర






**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** దేశంలో అత్యతం ప్రాధాన్యత కలిగిన పుణ్యక్షేత్రం భద్రాచలం నియోజక వర్గ కేంద్రం భద్రాచలం నుండి వాజేడు వరకు 120 కి.మి ఇసుక లారీల వల్ల ప్రధాన రహదారి పూర్తి స్థాయిలో ద్వంసంమైన పాలకు పట్టించిరు కోవడంలేదని సిపియం ఆద్వర్యంలో సోమవారం పాదయాత్ర ప్రారంభించారు. ఈసందర్బంగా సిపియం చేపట్టిన పాదయాత్రకువ సిపిఐ, బిఆర్‌యస్ మద్దతు ప్రకటించి సంగీబావం వ్యక్తంచేసారు. పాదయాత్రను సీనియరర్ నాయకులు ఎలమంచి రవికుమార్ ప్రారంభించారు. అనంతరం సిపియం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మజిల్లా కు ముగ్గురు మంత్రులు ఉన్న ఈ ప్రాంత ప్రజల సమస్య ఒక్కరోజు కూడా పట్టడం లేదని విమర్శించారు. ఇసుక లారీల వల్ల ఇక్కడ ద్వంసం అయిన రోడ్లతో ప్రజలు ప్రాణాలు పోతున్నాయి విన్నవించుకున్న కనికరం లేకుండా పోతుందని అన్నారు. ప్రతి నిత్యం ఇక్కడ జరగుతున్న ప్రాణ నష్టం చూస్తున్నప్పటికి రోడ్డు బాగు కోసం ఎలాంటి నిధులు మంజూరు చేయక ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని అన్నారు. ఈ నియోజక వర్గ ఎమ్మెల్యే అభివృద్ధి కోసం పార్టీ మారని గొప్పలు చెప్పుకుంటున్నరే తప్ప ఇక్కడ పరిస్థితులు కానరావడం లేదాని విమర్శించారు.నలబై ఏళ్ల చరిత్రలో ఈ ప్రాంత రహదారులకోసం రోడ్డెకిన చరిత్ర లేదని కొందరి నాయకుల స్వార్ధ రాజకీయాలకు ఈ ప్రాంత ప్రజలు అన్యాయం జరగుతుందరి అన్నారు. సిపిఐ మండల కార్యదర్శి బొల్లోజు వేణు , భద్రాచలం నియోజక వర్గ ఇంచార్జ మానే రామకృష్ణ పాద యాత్రకు మద్దతు ప్రకటించారు అనంరతం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రేస్ అధికారంలోకి వచ్చాక ప్రజలు విసిగి పోతున్నారని కనీస సౌకర్యాలు అందించడంలో పూర్తిగా విఫలమౌతుందన్నారు. భద్రాలచలం ఏజెన్సీ నియమాలు తుంగలో తొక్కుతు ధనార్జనే లక్ష్యంగా రాష్ట్రంలో పాలన సాగుతుందన్నారు. ఈకార్యక్రమంలో సిపియం రాష్ట్ర కమమిటి సభ్యులు ఎజె రమేష్, కారం పుల్లయ్య బ్రహ్మాచారి న్నా రెడ్డి రేపాకు శ్రీనివాస్ యలమంచి వంశీ కృష్ణ, చర్మం చంద్రయ్యకోరస చిలకమ్మ మచ్చరామారావు, యలమంచి శ్రీనుబాబు, బొల్లి సూర్యచంద్రరావు , సరియం కోటేశ్వరరావు, తెల్లం ధర్మయ్య, పూజారి సత్యనారాయణ, తదితరలుపాల్గోన్నారు

# స్థానిక ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి



## -అధికారులతో కలెక్టర్ సమీక్ష

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి నిర్వహించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధత, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్లు డా|| పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డిలతో కలిసి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక సంస్థలు, పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసినట్లు తెలిపారు. ప్రతిశాఖ ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో పనిచేసి ప్రశాంతంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సహకారం అందించాలన్నారు. ఎంపిటిసి, జెడ్పిటిసి స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో మండల ప్రత్యేకాధికారులు కీలక పాత్ర పోషించాలన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను తూచ తప్పకుండా పాటించాలన్నారు. వానాకాలం ధాన్యం కొనుగోలుకు పటిష్ట కార్యాచరణ సిద్ధం చేయాలని, గతంలో వచ్చిన ఇబ్బందులు పునరావృతం కాకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. పెండింగ్ సిఎంఆర్ రైస్ డెలివరీ గడువు లోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పత్తి కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు మద్దతు ధర అందేలా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన పరికరాలను సిద్ధం చేసుకోవాలన్నారు. క్రాప్ బుకింగ్ 50 శాతం మాత్రమే జరిగిందని వ్యవసాయ విస్తరణ అధికారి తన పరిధిలో సాగవుతున్న పంట విస్తీర్ణం వివరాలు సేకరించి అక్టోబర్ ఐదు లోపు క్రాప్ బుకింగ్ పూర్తి చేయాలన్నారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ఎ. పద్మశ్రీ, జెడ్పిసిఈవో దీక్షా రైనా, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బిసిల్లో జోష్ పెంచిన 42% రిజర్వేషన్లు..!

**-రిజర్వేషన్ల ఖరారుతో బిసిలకు భారీగా పెరిగిన సీట్లు**
**-రిజర్వేషన్ల పెంపు హర్షనీయం : జవ్వాజి నాగరాజు**




**ప్రజాపక్షం/వైరా:** జిల్లాలో స్థానిక ఎన్నికల సమరం ప్రారంభమైంది. స్థానిక సంస్థలు ఎన్నికల్లో బిసిలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ జీవోను విడుదల చేయడం ఆ తర్వాత రిజర్వేషన్లు ప్రకటించడంతో ఒక్కసారిగా బిసిలకు పంచాయతీలు, ఎంపిటిసిలు భారీగా పెరిగాయి. రిజర్వేషన్ ఖరారు చేయడం సోమవారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో ఒక్కసారిగా స్థానిక సంస్థలు ఎన్నికల్లో గెలుపు దిశగా బిసిల్లో జోష్ పెరిగి నువ్వా నేనా అనే పోటీకి సిద్ధమవుతున్నారు. పెద్ద ఎత్తున పంచాయతీల్లో ఎంపిటిసిల్లో బిసిల రిజర్వేషన్లు పెరగడంతో పోటీకి పెద్ద ఎత్తున ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే నేను పోటీలో ఉన్నాను అంటే నేను పోటీలో ఉన్నానని ఉత్సాహంగా దూసుకుపోతున్నారు. 42వ రోజు చేద్దాం రిజర్వేషన్లు పెంచడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పలువురు బిసి నాయకులు కృతజ్ఞతలు కూడా తెలుపుతున్నారు.

**బిసిలకు 42% రిజర్వేషన్లు కేటాయించడం హర్షనీయం : జవ్వాజి నాగరాజు**



స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జీవో తీసుకురావడం హర్షనీయమని కాంగ్రెస్ యువ నాయకుడు జవ్వాజి నాగరాజు అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పకుండా నిలబెట్టుకుందని ప్రజలు హర్షద్వానాలతో కృతజ్ఞతలు తెలుపుతున్నారని అన్నారు. పెద్ద ఎత్తున బిసిలు రాజకీయాల్లో రాణించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం రిజర్వేషన్లు పెంపడం ఎంతో గర్వకారణం అని నాగరాజు తెలిపారు.

# కార్మికుల ప్రాణాలకు రక్షణ ఎక్కడ..?

**ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది..?**





**ప్రజాపక్షం/వైరా:** కార్మికుల ప్రాణాలను పనంగా పెట్టి మున్సిపాలిటీలోని సెంటర్ లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రాణాలు పోతాయో ఉంటాయో అని తెలియక ఎలాంటి ప్రమాదం జరిగిద్దో గుర్తించుకోకుండా భారీ క్రేన్‌కు వేలాడిపడే విధంగా అందులో ఎలక్ట్రిషన్‌ను కూర్చోబెట్టి లైట్లు వేపించడం కార్మికుల ప్రాణానికి భద్రత లేదని తెలుస్తుంది. వాస్తవంగా మున్సిపాలిటీలో గాని కార్పొరేషన్‌లో గాని సెంట్రల్ లైట్లు పెట్టేటప్పుడు లేదా రిపేర్ చేసేటప్పుడు క్రేన్‌కు ఎలక్ట్రిషన్ నిల్చొనే విధంగా ఒక బాక్స్‌ను ఏర్పాటు చేసి క్రేన్ ద్వారా పైకి వెళ్లి రిపేర్ చేసేవిధంగా ఏర్పాట్లు చేస్తారు. కాని దానికి విరుద్దంగా వైరా మున్సిపాలిటీలో కార్మికులకు భద్రత లేకుండా రోడ్లపై ఉన్న వీధిలైట్లకు బెల్టులు వేలాడదీసి ఎలక్ట్రిషన్ రిపేర్లు చేపడుతున్నారు. జర ఒక్కసారి ఆలోచించండి సార్ అనుకోని విధంగా ఏదైనా జరిగితే ఆ కార్మికుడు కుటుంబానికి బాధ్యత ఎవరు వహించాలి. ఆ బెల్టు తెగదు ఏమి కాదు అని చెబుతున్నారు. ఒకవేళ తెగితే పరిస్థితి ఏంది? ఇప్పటికైనా అధికార యంత్రాంగం భవిష్యత్తులో కార్మికులు వీధిలైట్లపై సెంట్రల్ డివైండర్‌లో రిపేర్లు చేసేటప్పుడు ప్రమాదం జరగకుండా ఉండేవిధంగా క్రేన్‌కు బాక్స్‌ను ఏర్పాటు చేసి దాని ద్వారా ఎలక్ట్రిషన్స్ పనులు చేసేవిధంగా క్రేన్‌కు బాక్స్‌ను ఏర్పాటు చేసి దాని ద్వారా ఎలక్ట్రిషన్స్ పనులు చేసేవిధంగా చేస్తే మంచిదని ప్రజలు కోరుతున్నారు.

# జెవిఆర్ ఒసిలో ముందస్తు దసరా సంబరాలు

**-కార్మికులకు మహా అన్నదాన కార్యక్రమం**
**-ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే దంపతులు**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** జలగం వెంగళరావు ఓపెన్ కాస్ట్ కార్యాలయంలో దేవి నవరాత్రుల వేడుకలు అంబరాన్నంటాయి. సోమవారం ముందస్తుగా జరిగిన ఈ వేడుకకు స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ విజయ్ కుమార్ దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. తమ ప్రాణాలను పణంగా పెట్టి తమ వృత్తి ధర్మం నిర్వహిస్తున్న కార్మికులకు దుర్గామాత తోడుగా ఉండాలని ఆకాంక్షిస్తూ సింగరేణి యాజమాన్యానికి, కార్మికులకు, సత్తుపల్లి నియోజకవర్గ ప్రజలకు ముందస్తు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జే.వి.యర్ ఓ.సి ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎన్.వి.ఆర్ ప్రహ్లాద్, ఎస్.ఓ.యం బి.రాజేశ్వరరావు, ఎస్.ఓ.ఎం జి.కళ్యాణ్ రామ్, ప్రాజెక్ట్ ఇంజనీర్ డి.శ్రీనివాసరావు, సంక్షేమ అధికారి కే.దేవదాసు, ఎస్.ఈ ఎం.శ్రీనివాస్,జి.పూర్ణచంద్ర రావు, యూనియన్ ప్రతినిధులు జి.నరసింహారావు, ఎస్.సుధాకర్,టి.క్రాంతి, బి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్‌కి సన్మానం



**ప్రజాపక్షం/వైరా:** వైరా వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన రేచర్ల మల్లేశ్వరిని టిపిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు ఘనంగా సన్మానించారు. అనంతరం వ్యవసాయ డైరెక్టర్ రేచర్ల మల్లేశ్వరి మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌కి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావుకి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. వ్యవసాయ పంటను నిల్వ చేయడానికి గోదాంలో కావాల్సిన సౌకర్యాల కోసం కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కట్ల రంగారావు, కట్ల నాగరాజు, కట్ల సంతోష్, నాళ్ళ రమేష్, దగ్గుపాటి వీరరాబు, భాస్కర్, రేచర్ల నాగేశ్వరరావు, రేచర్ల రామారావు, రేచర్ల పుల్లయ్య, ప్రభాకర్‌రావు, రేచర్ల రాముడు, రేచర్ల సాయిరాం, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# చదువులతల్లి సాక్షిగా చదువులో రాణించాలి

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** చదువుల తల్లి సరస్వతమ్మ సాక్షిగా చదువులో రా ణించాలని చిన్నారులను దీవించారు సత్తుపల్లి శాసనసభ్యురాలు డా. మట్టా రాగమయి దయానంద్ విజయకుమార్ దంపతులు. దసరా నవరాత్రు లు సందర్భంగా సోమవారం అమ్మవారు మూల నక్షత్రం సందర్భంగా సరస్వతి అవతారంలో కొలువుదీరారు. ఈ సందర్భంగా సుమారు 200 మంది చిన్నారులకు సామూహిక అక్షరబ్యాస కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ విజయ్ కుమార్ లు ముఖ్య అతిధులుగా హాజరై చిన్నారుల చేత అక్షరాలు దిద్దించి, దీవించారు. ఈ కార్యక్రమం లో సత్తుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నారావు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ తోట సుజలా రాణి, సీనియర్ నాయకులు చలగుళ్ళ నర్సింహారావు, కమల్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే దంపతుల ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పట్టణంలో పలు కాలనీలలో జరుగుతున్న దసరా నవరాత్రులు పూజా కార్యక్రమాలకు సత్తుపల్లి శాసన సభ్యురాలు డా.మట్టా రాఘమయి దయానంద్ విజయకుమార్ దంపతులు సోమవారం హాజరై భక్తులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణ శివారులోని స్వరస్వతి ఆలయంలో మూల నక్షత్రం అమ్మవారు సరస్వతి రూపంలో దర్శనం ఇచ్చారు. అదేవిధంగా వెంగళరావు నగర్ కాలనీ, జవహర్ నగర్ లోని కృష్ణ మందిరం, జలగం వెంగళరావు ఓపెన్ కాస్ట్ లలో జరుగుతున్న దసరా నవరాత్రి వేడుకలకు హాజరైనారు. సందర్భంగా ఎమ్మెల్యే దంపతులు మాట్లాడుతూ సత్తుపల్లి నియోజకవర్గ ప్రజలకు దసరా, బతకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో సత్తుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, సింగరేణి పిఓలు ప్రహ్లాద్, నరసింహ, ఐఎన్‌టియు నాయకులు రామారావు, క్రాంతి కుమార్, ఏఐటీయూసీ నాయకులు సుధాకర్, భీమయ్య, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గాదె చెన్నారావు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ తోట సుజలా రాణి, మాజీ కౌన్సిలర్స్, సీనియర్ నాయకులు కమల్ పాషా, సత్తుపల్లి పట్టణ, మండల కాంగ్రెస్ నాయకులు, మహిళా, యూత్,ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

# గుండె వైద్య నిపుణులు హర్షతేజకు సన్మానం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అంతర్జాతీయ గుండె దినోత్సవ సందర్భంగా ప్రముఖ గుండె వైద్య నిపుణులు పేర్ల హర్షతేజను విశ్రాంత పోలీస్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. సోమవారం స్తంభాద్రి హాస్పిటల్‌లోని ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ పేర్ల హర్షతేజను విశ్రాంత పోలీస్ అధికారుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్. రాధాకృష్ణమూర్తి, రుద్ర వెంకటనారాయణ లు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఉచితంగా గుండె వైద్య శిబిరాలు నిర్వహించి తమ సంఘం సభ్యులకు గుండె సంబంధిత రోగాల భారీన పడకుండా డాక్టర్ పేర్ల హర్షతేజ కాపాడారని సంఘం బాధ్యులు తెలిపారు. సుమారు 266 మందికి గుండె సంబంధిత వైద్య సేవలు అందించారని ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ పిఆర్‌వో ఇషాక్ పాషా, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మొదలైన ఎన్నికల హడావుడి..!

**ప్రజాపక్షం/పెనుబల్లి:** ఎప్పుడు.. ఎప్పుడా అని ఎదురు చూస్తున్న సమయం రానే వచ్చింది. స్థానిక సంస్థలు జడ్పిటిసి, ఎంపీటీసీ, పంచాయతీ సర్పంచ్‌ల కాలం సంవత్సరకాలం దాటినా వివిధ కారణాలతో ఎన్నికలు వాయిదా పడుతూ వస్తున్నాయి. నాటి నుండి స్థానిక సంస్థల కోసం నాయకులు, ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఎట్టకేలకు ప్రభుత్వం రిజర్వేషన్ల జీవో విడుదల చేసింది. రిజర్వేషన్ ప్రక్రియను ప్రకటించింది. ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ని విడుదల చేసింది. పెనుబల్లి మండలంలో ఎన్నికల హడావుడి మొదలైంది. పెనుబల్లి మండలంలో ఎంపీపీ స్థానం ఎస్టి, జడ్పిటిసి స్థానాన్ని బీసీ మహిళకు కేటాయించారు. పెనుబల్లి మండలంలో 33 గ్రామపంచాయతీలు, జడ్పిటిసి 15 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. మండలంలో మొత్తంగా 43,873 ఓట్లు ఉన్నాయి. అందులో పురుషుల 21,342 ఓట్లు, మహిళా ఓట్లు 22,531 ఓట్లు ఉన్నాయి.